క్లుప్తంగా

పాలనలో కాంగ్రెస్ విఫలం
ఎమ్మెల్యే చింతా ప్రభాకర్


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రభాకర్

కంది(సంగారెడ్డి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆరోపించారు. మంగళవారం మండలంలోని చిమ్నపూర్ పాత చెరువు కట్టప్పపై ఉన్న కట్ట మైసమ్మ ఆలయ వార్షికోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఆత్మీయ భరోసా, రైతుబంధు పూర్తి స్థాయిలో అమలు చేశాకే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. హామీలను నెరవేర్చక పోవడంతో ప్రజలు కాంగ్రెస్ పాలనపై ఆగ్రహంగా ఉన్నారని, ఎన్నికల్లో ప్రభుత్వానికి బుద్ధి చెబుతారన్నారు. హామీలు అమలు చేసే వరకు ప్రజల తరఫున బీఆర్‌ఎస్ పోరాడుతుందని తెలిపారు. సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు బుచ్చిరెడ్డి, నరహరిరెడ్డి, కృష్ణగౌడ్, మధుసూదన్‌రెడ్డి, మనోహర్‌గౌడ్ పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న శ్రీనివాస్

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీల్లో మంగళవారం మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ ఆదేశాల మేరకు శానిటరీ అధికారి శ్రీనివాస్ తడి, పొడిచెత్తపై ఆయా కాలనీల ప్రజలకు అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తను వేర్వేరు బుట్టల్లో ఉంచి ఇళ్ల వద్దకు వచ్చే చెత్త తరలింపు ఆటోల్లో వేయాలని సూచించారు. చెత్త తరలింపు ఆటోల సిబ్బందికి సైతం పలు సూచనలిచ్చారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హత్నూర(సంగారెడ్డి): కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం సభ్యుడు నర్సింలు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని కాసాల గ్రామ శివారులోని 336 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేసుకున్నారని ఆరోపించారు. ఆ భూమిలో 2007–2008లో ప్రభుత్వం నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వడం కోసం అర్హుల జాబితాను ప్రకటించింది. అనివార్య కారణాల వల్ల వాయిదా పడడంతో ఆక్రమణకు గురైందని వాపోయారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం స్పందించి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని నిరుపేదల ఇళ్ల స్థలాలకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

బాలికలకు సైకిళ్ల పంపిణీ


సైకిళ్లు అందజేస్తున్న మేనేజర్ నాగరాజు

జోగిపేట(అందోల్): జోగిపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఎస్‌బీఐ పోస్ట్ ఆఫీస్ బ్రాంచ్ మేనేజర్ నాగరాజు మంగళవారం పది మంది బాలికలకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంకు సేవా కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు సైకిళ్ల అందించామన్నారు. కార్యక్రమంలో అకౌంటెంట్ మహేశ్వరి, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

అర్చకుడిపై దాడి సరికాదు

నారాయణఖేడ్: చిలుకూరి బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై దాడి సరికాదని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాయిరాం అన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. కావాలనే కొందరు రామరాజ్యం సంస్థగా పేరు పెట్టుకుని దాడి చేశారన్నారు. హిందుత్వం అంటే గిట్టని కొంతమంది సంఘ్ పరివార్‌పై బురద జల్లేయత్నం చేస్తున్నారన్నారు. దేశం కోసం, ధర్మం కోసం, ఆలయాల పరిరక్షణ కోసం అర్చకుల కోసం సంఘ్ పరివార్ నిరంతరం పోరాడుతుందన్నారు. దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి సతీష్‌కుమార్, నాయకులు ప్రవీణ్, లోకేష్‌స్వామి పాల్గొన్నారు.

● ముట్టుకుంటే ముడుచుకుంటా..

సంగారెడ్డి జిల్లా సైన్స్ కేంద్రంలో ఏర్పాటు చేసిన అత్తిపత్తి మొక్క విద్యార్థులను ఆకట్టుకుంటోంది. చూడటానికి సాధారణ మొక్కలాగే కనిపిస్తుంది.. ఎవరైనా మొక్కను ముట్టుకున్నా, కొమ్మలను కదిపినా ఆకులన్నీ ముడుచుకుంటాయి. ముప్పై నిమిషాల నుంచి గంటలోపు ఆకులన్నీ తిరిగి విచ్చుకుంటాయి. దీనితో విద్యార్థులంతా టచ్ మీ నాట్ ప్లాంట్‌ను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి



ముట్టుకోక ముందు విచ్చుకున్న అత్తిపత్తి మొక్క



ముట్టుకున్నాక ముడుచుకున్న అత్తిపత్తి

విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ప్రారంభం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని కొల్కూర్ గ్రామంలో రత్నగర్భ గణపతి స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం మఠం రాచోటప్ప స్వామి ఆధ్వర్యంలో నూతన విగ్రహాల ఊరేగింపు కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈనెల 13న విగ్రహ దాత ప్రభాకర్‌గౌడ్, మాజీ సర్పంచ్ భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో రత్నగర్భ గణపతి, నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ప్లాస్టిక్ నిషేధం ఎక్కడ?

- దుకాణాల్లో జోరుగా కవర్ల అమ్మకాలు
- అధికారుల ఆదేశాలు బేఖాతర్

ప్లాస్టిక్‌పై నిషేధం ఉన్నా కూడా ఉత్పత్తి, వినియోగం మాత్రం ఆగడం లేదు. అధికారులు, ఉద్యోగులు ప్లాస్టిక్ వినియోగంపై చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని చెప్పొచ్చు. ఏడాదికొకసారి మొక్కు బడిగా దుకాణాల మీద దాడులు నిర్వహిస్తారు. కొద్ది రోజులు కాగానే మళ్లీ యథాప్రకారం ప్లాస్టిక్ కవర్ల అమ్మకాలు నిర్వహిస్తున్నారు.


పట్టణ వీధుల్లో వాడి పడేసిన ప్లాస్టిక్ కవర్లు

పటాన్‌చెరు టౌన్: ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడాలని అంటారే తప్పా ఆచరణలో మాత్రం సాధ్యం కావడం లేదు. సంవత్సరంలో ఒక రోజు జూన్ 5న పర్యావరణ దినోత్సవం.. రోజున పర్యావరణాన్ని కాపాడాలని, ప్లాస్టిక్ వాడకూడదని అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నారు. తర్వాత యథావిధిగా దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్ల అమ్మడం.. .. ప్రజలు వాడటం పరిపాటే. సంగారెడ్డి జిల్లా.. పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో ప్లాస్టిక్ వినియోగం రోజురోజుకు పెరిగిపోతుంది. ప్రతి దుకాణంలోనూ ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు లభ్యమవుతున్నాయి. ప్లాస్టిక్‌ను వాడొద్దని అధికారులు చెబుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఏ రోడ్డుపై చూసినా వాడిపడేసిన ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు దర్శనమిస్తున్నాయి. వాటిని తిన్న మూగ జీవాలు అనారోగ్యానికి గురవుతున్నాయి. ప్లాస్టిక్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, వాటి వల్ల కలిగే దుష్పరిణామాలు గురించి వివరించి, వినియోగాన్ని క్రమంగా తగ్గించే మార్గాలను అన్వేషించాలని, పర్యావరణ వేత్తలు అభిప్రాయపడుతున్నారు.

జ్యూట్ బ్యాగులు వాడాలి

ప్రత్యామ్నాయంగా జ్యూట్ బ్యాగులు వినియోగంలోకి తీసుకురావాలని పర్యావరణ వేత్తలు సూచిస్తున్నారు. ప్లాస్టిక్ కవర్లను ఉత్పత్తి చేస్తున్న సంస్థలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నా దుకాణదారులు పట్టించుకోవడం లేదు. వీటిని అమ్ముతున్న దుకాణాలపై చర్యలు తీసుకుంటే కొద్ది వరకైనా వినియోగం తగ్గించవచ్చని పలువురు పేర్కొంటున్నారు. ప్రజలు ప్లాస్టిక్ వినియోగానికి అలవాటు పడటంతో ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, ప్లేట్లు తయారు చేసే కంపెనీలు పెరిగిపోతున్నాయి.

అలవాటుగా మారింది..



ప్రజలకు ప్లాస్టిక్ వాడటం అలవాటుగా మారింది. మార్కెట్ లో కూరగాయల కొనుగోలు చేసినా.. కిరణాదుకాణాల్లో సరుకులు కొనుగోలు చేసినా ప్లాస్టిక్ కవరల్లోనే ఇస్తున్నారు. దీంతో ప్రజలు కూడా ప్లాస్టిక్ వాడకానికి బాగా అలవాటు పడ్డారు. వాడిన కవర్లను పట్టణ, గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ పడేస్తున్నారు.

- శ్రావణ్ కుమార్, పటాన్‌చెరు

జ్యూట్ బ్యాగులను ప్రోత్సహించాలి



పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత. అందుకు ప్రతి ఒక్కరు జ్యూట్ బ్యాగులను వాడాలి. ఇంటి నుంచి మార్కెట్‌కు లేదా ఇతర పనులపై సరుకులు తెచ్చుకోవడానికి వెళ్లితే వెంబడి జూట్ బ్యాగులను తీసుకొని వెళ్లాలి. ప్లాస్టిక్ వాడకంపై ప్రజలకు అధికారులు అవగాహన కల్పించాలి.

- నాగరాజుయాదవ్, న్యాయవాది పటాన్‌చెరు

పైప్‌లైన్ పనులు అడ్డుకున్న గ్రామస్తులు

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం, గుండ్ల మాచునూర్ గ్రామశివారులోని కోవాలెంట్ లేబరేటరీస్ పరిశ్రమ యాజమాన్యం సోమవారం రాత్రి అక్రమంగా పైప్‌లైన్ ఏర్పాటుకు చేస్తున్న తవ్వకం పనులను గ్రామస్తులు అడ్డుకున్నారు. మంగళవారం ఉదయం గ్రామస్తులు పైప్‌లైన్ తవ్వకం పనుల వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గతంలో పరిశ్రమ యాజమాన్యం ఏర్పాటు చేసిన పైప్‌లైన్ నుంచి పరిశ్రమ వ్యర్థజలాలను సమీపంలోని నక్కవాగులోకి వదలడంతో పాటు వాగు నీటిని పరిశ్రమకు తరలిస్తున్నారని ఆరోపించారు. కాలుష్య జలాలతో నక్కవాగు పరిసర ప్రాంతం కాలుష్యమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అది చాలదన్నట్లుగా అదనంగా మరో పైప్‌లైన్ ఏర్పాటు చేయడం ఏంటని ప్రశ్నించారు. వెంటనే పైప్‌లైన్ పనులు విరమించుకుంటున్నట్లు లిఖితపూర్వకంగా రాసి ఇవ్వాలని అప్పటివరకు ఆందోళన విరమించేది లేదని తేల్చి చెప్పారు. దీంతో పోలీసులు పరిశ్రమ ప్రతినిధులను పిలిపించి గ్రామస్తులతో మాట్లాడించారు. పనులను నిలిపివేస్తున్నట్లు పరిశ్రమ ప్రతినిధులు చెప్పడంతో ఆందోళన విరమించారు. అనంతరం జిల్లా కలెక్టర్, పీసీబీ అధికారులకు ఫిర్యాదులు చేసినట్లు తెలిపారు.


పైప్‌లైన్ తవ్వకం వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

ఆర్యవైశ్య మహిళల పాదయాత్ర

జోగిపేట(అందోల్): జోగిపేట ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జోగిపేట నుంచి చిలప్‌చెడ్ మండలం పరిధిలోని చాముండేశ్వరీ దేవాలయం వరకు పాదయాత్రను నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు గోలిపద్మ నేతృత్వంలో 11 కి.మీటర్లు పాదయాత్రను నిర్వహించారు. తాము లోకకళ్యాణార్థం 'మనసారా.. మన సారె' కార్యక్రమంలో భాగంగా ఈ యాత్ర చేపడుతున్నామని చెప్పారు. ప్రతి నెల మొదటి మంగళవారం ఒక అమ్మవారికి ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో ఓడిబియ్యం, చీర, జాకెట్టు పెట్టి పూజలు చేస్తామన్నారు. జోగిపేటలోని అన్ని అమ్మవార్ల దేవాలయాల్లో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ రోజు శ్రీ చాముండేశ్వరీ దేవి అమ్మవారికి ఓడిబియ్యం సమర్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మహిళ సంఘం ప్రధాన కార్యదర్శి గజ్వాడ మంజుల, ఉపాధ్యక్షురాలు చందన, కోశాధికారి అనిత, సహాయ కార్యదర్శి కాసాల నాగమణి, 50 మంది సభ్యులు పాల్గొన్నారు.


పాదయాత్రను ప్రారంభిస్తున్న మహిళలు

నిర్లక్ష్యంతోనే అభివృద్ధిలో వెనుకడుగు

మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): ప్రభుత్వ నిర్లక్ష్యంతో నియోజకవర్గం అభివృద్ధి వెనుకబడిందని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కల్హేర్‌లో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 30 పడకల ఆస్పత్రి నిర్మించామని తెలిపారు. ప్రస్తుతం ఆస్పత్రిలో వైద్యులను నియమించడం లేదని మండిపడ్డారు. మాసాన్‌పల్లి–నల్లవాగు రహదారి అభివృద్ధిని పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం నిర్మాణ పనులు పూర్తి చేయించాలని డిమాండ్ చేశారు. అనంతరం కృష్ణాపూర్‌లో ఇటీవల మరణించిన చాకలి మల్లవ్వ, గడ్డి మానెవ్వ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాంసింగ్, మాజీ జెడ్పీటీసీ నర్సింహారెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యులు ఎం.ఏ.ఘని, పీఏసీఎస్ చైర్మన్ గంగారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

వైభవంగా మల్లికార్జునస్వామికి బోనాలు


బోనాలు ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

జోగిపేట(అందోల్): జోగిపేట పట్టణంలో కేతకీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మంగళవారం బోనాల ఉత్సవాలను గొల్ల కురుమలు ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. జోగిపేటలోని బెల్లంగొని నుంచి ఆలయం వరకు బోనాల ఊరేగింపు సాగింది. ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ జైపాల్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, మాజీ జెడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్, మాజీ ఎంపీపీ బాలయ్య, ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

నూతన సేవలతో ప్రయోజనం

నారాయణఖేడ్: మీసేవలో నూతన రేషన్‌కార్డు, యూడీఐడీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సంగారెడ్డి జిల్లా ఈడీఎం ఉదయ్‌కుమార్ సూచించారు. పట్టణంలోని మీసేవ కేంద్రాలను మంగళవారం ఈడీఎం మేనేజర్ ప్రదీప్‌తో కలసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. మీసేవ నిర్వాహకులు వినియోగదారులకు మెరుగైన సేవలను అందించాలని, నిర్ణీత ధర తీసుకోవాలన్నారు. వేసవికాలం నేపథ్యంలో వినియోగదారులకు మంచినీటి సౌకర్యం కేంద్రంలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు.


మీసేవ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఉదయ్‌కుమార్

ఘనంగా శివ మహాపడిపూజ


పడిపూజలో పాల్గొన్న శివస్వాములు

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని శ్రీకాశిక భవాని మందిరంలో మంగళవారం బాలు శివగురు స్వామి ఆధ్వర్యంలో శివ మహాపడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివలింగానికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో శివ స్వాముల భక్తులు పాల్గొన్నారు.

శ్రీశైలానికి తరలిన శివస్వాములు

సదాశివపేట(సంగారెడ్డి): శివదీక్షలు స్వీకరించిన శివస్వాములు మంగళవారం పట్టణం నుంచి శ్రీశైలం మల్లికార్జున భ్రమరాంబ అమ్మవారిని దర్శించుకునేందుకు బయలుదేరారు. పట్టణంలోని ఎడ్లబజార్ బసవేశ్వర మందిరంలో ఉదయం స్వాములు భక్తిశ్రద్ధలతో ఇరుముడి కట్టుకుని ఓం నమఃశివాయ నామస్మరణతో శ్రీశైలం తరలివెళ్లారు. కార్యక్రమంలో శివస్వాములు సుకుమార్, లక్ష్మన్, పవన్‌గౌడ్, మహేశ్‌గౌడ్, హన్మంత్‌రెడ్డి, మురళి, ప్రభు, మహేష్ స్వాములు తరలివెళ్లారు.


ఇరుముడి కట్టుకుంటున్న స్వాములు

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

సంగారెడ్డి క్రైమ్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా న్యాయస్థానం జైలుశిక్ష విధించిన సంఘటన సంగారెడ్డి పట్టణ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ సుమన్‌కుమార్ కథనం ప్రకారం సోమవారం అర్ధరాత్రి పోతిరెడ్డిపల్లి, పాత బస్టాంట్ వద్ద నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని మంగళవారం జిల్లా న్యాయస్థానంలో హాజరుపరచగా జిల్లా అదనపు న్యాయమూర్తి షకీల్ అహ్మద్ సిద్దిఖీ రెండు రోజులు జైలుశిక్ష విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పటాన్‌చెరు టౌన్: సబ్‌స్టేషన్ మరమ్మతుల్లో భాగంగా బుధవారం ఉ.10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు కంజర్ల ఫీడర్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఏఈ జగదీశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పారిశ్రామిక ప్రాంతం, సాయిగణేష్ కాలనీ, ఆల్వేన్ కాలనీ, సింఫనీ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

పటాన్‌చెరు టౌన్: అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎస్ఎస్ఎల్ కాలనీలో పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం నేటి నుంచి 14 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు నరసింహులు గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొదటి రెండు రోజులు ప్రత్యేక పూజలు ఉంటాయని, 14న అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం, బోనాల సమర్పణతో పాటు ఒగ్గు కథ ఉంటుందన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు
డీఎస్పీ సత్తయ్య


దర్గా పరిసరాలను పరిశీలిస్తున్న డీఎస్పీ

వట్‌పల్లి(అందోల్): శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించబోమని సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య హెచ్చరించారు. మంగళవారం వట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాలు, రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇటీవల పోలీసు విధుల్లో చేరిన సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. డయల్ 100 ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలన్నారు. సీసీ కెమెరాలు ఆవశ్యకతపై ప్రజలకు, వ్యాపారులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజల ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మహాశివరాత్రి పర్వదినాన వట్‌పల్లిలో జరిగే వెంకటఖ్వాజా దర్గా ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జోగిపేట సీఐ అనిల్‌కుమార్, ఎస్ఐ విఠల్ ఆయన వెంట ఉన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

నారాయణఖేడ్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికత కల్గిండాలని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఖేడ్ నుంచి మహారాష్ట్రలోని పవిత్ర పుణ్యక్షేత్రం పండరీపూర్ విఠలేశ్వర ఆలయానికి బీఆర్‌ఎస్ నాయకులు పాదయాత్రగా వెళ్లి స్వామివారిని దర్శించుకుని మంగళవారం తిరిగి వచ్చి భూపాల్ రెడ్డిని కలిశారు. ఆయన వారిని అభినందించారు. పండరీపూర్ భక్తుల కోరిక మేరకు ఖేడ్‌లో కరణ్ గజేంద్రభారతి మహారాజ్ ఆశ్రమం కోసం తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు 20 గుంటల స్థలాన్ని కేటాయించిన విషయాన్ని గుర్తుచేశారు. మాజీ జెడ్పీటీసీ రవీందర్‌నాయక్ పాండురంగస్వామి చిత్రపటాన్ని భూపాల్‌రెడ్డికి బహూకరించి, ప్రసాదం అందజేశారు. సీనియర్ నాయకులు కిష్టయ్య మాస్టర్, మాజీ సర్పంచ్ వెంకటేశం, నాయకులు అంజాగౌడ్, భీమన్న, మల్గొండ, ప్రశాంత్‌సాగర్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.


చిత్రపటాన్ని అందజేస్తున్న రవీందర్‌నాయక్

మోడల్ స్కూల్ సందర్శన

రామచంద్రాపురం (పటాన్ చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల ప్రభుత్వ తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలను మంగళవారం అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసాచారి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఇష్టంగా చదివి మంచి మార్కులను సాధించాలన్నారు. పట్టుదలతో చదువుకున్నప్పుడే లక్ష్యాన్ని సాధిస్తామని తెలిపారు. పరీక్షల సమయంలో ఒత్తిడికి లోను కాకుండా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్, మానిటరింగ్ అధికారి మంజరి, ప్రిన్సిపాల్ పద్మలత, వైస్ ప్రిన్సిపాల్ అరవింద్ పాల్గొన్నారు.


ల్యాబ్‌ను పరిశీలిస్తున్న అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసాచారి

నూతన కమిషనర్‌కు సన్మానం

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం గడ్డపోతారం మున్సిపాలిటీ నూతన కమిషనర్ జైత్రారామ్‌ను బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు వెంటేష్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించిన శుభాకాంక్షలు తెలిపారు. నూతన మున్సిపల్ అభివృద్ధికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు కుమార్ పాల్గొన్నారు.


కమిషనర్‌ను సన్మానిస్తున్న నాయకులు



ఘనంగా శివాలయం వార్షికోత్సవం

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలం ఔరంగ్‌నగర్‌లోని శివాలయ మూడోవ వార్షికోత్సవం మంగళవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. యజ్ఞం, హోమం, అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారి పల్లకీసేవా ఊరేగించారు.